క్లుప్తంగా

బీమా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి



పడిగెపాడులో మస్టర్లను తనిఖీ చేస్తున్న ఏపీఓ

ఉయ్యాలవాడ : ప్రధానమంత్రి సురక్ష బీమా పథకాన్ని వ్యవసాయ కూలీలు సద్వినియోగం చేసుకోవాలని ఏపీఓ రవిప్రకాష్ తెలిపారు. గురువారం మండలంలోని పడిగెపాడు, తుడుమలదిన్నె గ్రామాల్లో ఉపాధి హామీ పథకంలో భాగంగా ఫాం పాండ్స్, పంట కాలువల పనులను పరిశీలించారు. కూలీల మస్టర్లను తనిఖీ చేసి ప్రతి కూలీకి రోజు రూ.272 కూలి వచ్చేలా పనులు కల్పించాలని ఫీల్డ్ అసిస్టెంట్లకు సూచించారు. బీమా పథకం కోసం 18 నుంచి 50 సంవత్సరాల్లోపు వయసు కలవారు రూ.450 పోస్ట్ ఆఫీస్ లేదా తమకు అందుబాటులో బ్యాంకుల్లో ప్రీమియం చెల్లించి నమోదు చేసుకోవాలని సూచించారు. అలాగే 50- 70 సంవత్సరాలు కల వారు ప్రీమియం రూ.20 చెల్లించేందుకు అర్హులన్నారు. ప్రస్తుతం మాయలూరులో 50 మంది కూలీలు బీమాకు నమోదు చేయించుకున్నారని చెప్పారు.

నివాళి

శిరివెళ్ల: వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు గుండంపాడు మాజీ సర్పంచు సదాశివారెడ్డి గురువారం అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్సీ గంగుల ప్రభాకరరెడ్డి, ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి గ్రామానికి చేరుకుని మృత దేహంపై పుష్పగుచ్ఛం ఉంచి నివాళులర్పించారు. ఆయన మృతి పార్టీకి తీరని లోటని, కుటుంబానికి అండగా ఉంటామని చెప్పారు.

రాష్ట్రాభివృద్ధికే మహాయజ్ఞం

నంద్యాల(వ్యవసాయం): రాష్ట్రాభివృద్ధికి దేవదాయ, ధర్మాదాయ శాఖ నిర్వహణలో ఈనెల 12 నుంచి 17వ తేదీ వరకు ఆరు రోజుల పాటు అష్టోత్తర శతకుండాత్మక చండీ, రుద్ర, రాజశ్యామల, సుదర్శన సహిత శ్రీలక్ష్మీ మహాయజ్ఞాన్ని నిర్వహిస్తున్నట్లు నంద్యాల జిల్లా అసిస్టెంట్ కమిషనర్ సుధాకర్‌రెడ్డి తెలిపారు. గురువారం కార్యాలయంలో కరపత్రాలను విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విజయవాడ బందర్ రోడ్డులోని ఇందిరా గాంధీ మున్సిపల్ స్టేడియంలో 12వ తేదీన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి, శ్రీలక్ష్మీ మహాయజ్ఞంతో కార్యక్రమాన్ని ప్రారంభిస్తారన్నారు. దుర్గామల్లేశ్వర స్వామి, ద్వారకా తిరుమల వేంకటేశ్వరస్వామి, అన్నవరం సత్యనారాయణస్వామి, శ్రీశైల భ్రమరాంబ మల్లికార్జునస్వామి, వరాహ లక్ష్మీనరసింహస్వామి వార్ల కల్యాణం రోజుకొకటి చొప్పున జరిపిస్తారన్నారు. భక్తులు పాల్గొనాలని కోరారు.

15 నుంచి ప్రతిష్ఠోత్సవాలు



రెడ్డిపల్లెలో నూతనంగా నిర్మితమైన ఆలయం

రుద్రవరం: మండలంలోని రెడ్డిపల్లె గ్రామంలో ఈ నెల15 నుంచి 17వ తేదీ వరకు అభయ ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠోత్సం వైభవంగా నిర్వహించేందుకు గ్రామ పెద్దలు ఏర్పాట్లు చేపట్టారు. గ్రామస్తులంతా కలిసి సొమ్ము పోగు చేసుకొని నూతన ఆలయ నిర్మాణం పూర్తి చేశారు. ప్రస్తుతం ఆలయానికి తుది మెరుగులు దిద్దుతున్నారు. ప్రతిష్ఠోత్సవం సందర్భంగా మూడు రోజుల పాటు విశేష పూజా కార్యక్రమాలతో పాటు పలు రకాల పోటీలు ఏర్పాటు చేశారు. 16వ తేదీన ట్రాక్టర్ రివర్స్, మోటార్ సైకిల్ రౌండ్, రాతి గుండు ఎత్తడం, 17న ఎద్దుల బండ లాగుడు పోటీలు ఏర్పాటు చేశారు. బండలాగుడు పోటీల్లో విజేతలకు వరుసగా రూ.30వేలు, రూ.20వేలు, రూ.10వేలు, రూ.5116, రూ.5వేల అందజేస్తామని నిర్వాహకులు తెలిపారు.

షిరిడీ సాయికి ప్రత్యేక పూజలు



నంద్యాలటౌన్: స్థానిక నాగులకుంట రోడ్డులో వెలసిన షిరిడీ సాయిబాబా దేవాలయంలో గురువారం బాబాకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారుజామున స్వామి వారి మూలవిరాట్‌కు సుప్రభాత సేవ, పంచామృతాభిషేకాలు జరిపించి ప్రత్యేకంగా అలంకరించిన అనంతరం భక్తులను దర్శనానికి అనుమతించారు. మధ్యాహ్నం మహా మంగళ హారతి ఇచ్చి భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం ఆలయ ఆవరణలో షిరిడీ సాయిబాబా సేవా సమితి సభ్యుల ఆధ్వర్యంలో పల్లకోత్సవం చేపట్టారు.

అందుబాటులో విత్తనాలు

గడివేముల: ఖరీఫ్ సీజన్‌కు రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు స్థానిక ఆర్బీకేల్లో అందుబాటులో ఉన్నాయని మండల వ్యవసాయ అధికారి హేమసుందర్ రెడ్డి తెలిపారు. గురువారం గడివేముల ఆర్బీకేను తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ..విత్తనాలు, ఎరువులు కావలసిన రైతులు స్థానిక ఆర్బీకేల్లో పేర్లను నమోదు చేసుకోవాలన్నారు.

దిగుబడి, ధర మెరిసే.. కౌలు పెరిగే

- గత ఖరీఫ్, రబీలో ఆశాజనకంగా మినుము, మిరప ఉత్పత్తులు, ధర
- 2021-2022లో మాగాని భూముల్లో వరి సాగుకు రైతుల వెనుకంజ
- 2022-23లో విరగ్గాసిన పంట..
- లాభాలు చూసిన అన్నదాతలు
- తాము కూడా అదే దారిలో అంటూ.. భూముల గుత్త పెంచేసిన యజమానులు

డిమాండ్ ఉన్నప్పుడే లాభాలు ఆర్జించాలనేది వ్యాపార సూత్రం. ఇదే విధానాన్ని నంద్యాల వ్యవసాయ సబ్ డివిజన్‌లోని మెట్ట భూ యజమానులు వంటబట్టించుకున్నారు. గత ఖరీఫ్, రబీలో పంటల దిగుబడి పెరగడం, గిట్టుబాటు ధర లభించడంతో కౌలు రైతులు లాభాలు ఆర్జించారు. దీన్ని గమనించిన భూ యజమానులు గుత్తలను అమాంతం పెంచేశారు. గతేడాది మిరప సాగు చేసే పొలం ఎకరాకు రూ.40 వేల వరకు చెల్లించగా.. ప్రస్తుతం రూ.55వేల నుంచి రూ.60వేలు డిమాండ్ చేస్తున్నారు. నష్టాల సమయంలో తమను ఆదుకోకపోగా.. ఒక్కసారి లాభాలకే కౌలు పెంచడం సమంజసం కాదని కౌలు రైతులు వాపోతున్నారు.



చాపిరేవుల-పాండురంగాపురం మధ్యలో మెట్ట పొలాన్ని దున్నుతున్న రైతు

నంద్యాల(అర్బన్): నంద్యాల వ్యవసాయ సబ్ డివిజన్‌లో గతంలో ఎన్నడూ లేని విధంగా మాగాని కంటే మెట్ట భూములకు డిమాండ్ ఏర్పడింది. గత ఏడాది మెట్ట భూముల్లో పండిన పంటలు, వాటి దిగుబడులు, మద్దతు ధరలతో రైతులు ఊరట చెందారు. దీంతో ఈ ఏడాది ఆ భూముల కౌలుకు డిమాండ్ పెరిగింది. సాగునీరున్న పొలాల్లో మిరప ఎకరాకు 37 క్వింటాళ్ల దిగుబడులు రాగా, క్వింటా రూ.2వేల నుంచి రూ.2200 వరకు అమ్మకాలు జరిగాయి. మామూలు పొలాల్లో సైతం ఎకరాకు 15 నుంచి 20 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. అలాగే.. మినుము ఆరు నుంచి 12 క్వింటాళ్ల దిగుబడి రాగా, క్వింటా రూ.7,200 నుంచి రూ.7,300 ప్రకారం విక్రయించారు. మొక్కజొన్న ఎకరాకు 20 నుంచి 28 క్వింటాళ్ల దిగుబడులు లభించగా.. ప్రభుత్వం మద్దతు ధర క్వింటా ధర రూ. 1962తో కొనుగోలు చేస్తుంది. పత్తి మినహా మెట్ట పొలాల్లో రైతులు సాగు చేసిన అన్ని రకాల పంటల దిగుబడులు, ధరలు ఆశాజనకంగా లభించాయని రైతులు సంతోషంలో ఉండగా.. భూ యజమానులు దిగుబడులు, ధరలను దృష్టిలో పెట్టుకొని కౌలును అమాంతం పెంచేశారు. దీంతో గత ఏడాదితో కౌలు ముగిసిన రైతులకు ఇక్కట్లు తప్పడం లేదు. నంద్యాల వ్యవసాయ సబ్ డివిజన్‌లో 62వేల హెక్టార్లలో పంటలు సాగవుతున్నాయి. అందులో 5,300 మంది కౌలు రైతులు పొలాలు సాగు చేస్తున్నారు.

ఎకరాకు రూ.60 వేల పైమాటే..

గత ఏడాది ఎకరా మెట్ట భూమి రూ.30 వేల నుంచి రూ.40 వేలు చెల్లించి రైతులు కౌలుకు తీసుకున్నారు. అయితే ఈ ఏడాది మిరప, మినుము పంట దిగుబడులు ఆశాజనకంగా రావడం, మద్దతు ధర లభించడంతో భూ యజమానులు కౌలును పెంచేశారు. మిరప ఏగిలి ఉండి కాల్వల నీరు పారే ఏర్పాటు ఉన్న మెట్ట భూములకు రూ.55 వేల నుంచి రూ.60 వేలు, ఆయిల్ మోటారు సౌకర్యం ఉన్న భూములు రూ.35వేలు, వర్షాధార భూములకు రూ.20వేల కౌలును నిర్ణయించారు. అలాగే.. మాగాని భూముల్లో వరి సాగు చేసే భూములను 2021-22లో కౌలుకు తీసుకునేందుకు భయపడిన అన్నదాతలు.. 2022-23లో ఖరీఫ్, రబీ సీజన్లలో వరి సాగు చేయగా.. ఎకరాకు 40 -45 బస్తాల దిగుబడి వచ్చింది. దీంతో భూ యజమానులు ఈ ఏడాది కౌలు కింద 20 నుంచి 22 బస్తాల వడ్లు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. కాగా పలు ప్రాంతాల్లో కొందరు రైతులు మునుగుత్త చెల్లించి పొలాలను తీసుకోగా, మరికొందరు సందిగ్ధంలో కొట్టుమిట్టాడుతున్నారు.

తప్పనిసరి పరిస్థితుల్లో..

గత ఖరీఫ్, రబీ సీజన్లలో వచ్చిన దిగుబడులు, ఆదాయాన్ని దృష్టిలో పెట్టుకొని కౌలు రైతులు ఎక్కువ కౌలు మొత్తాలను చెల్లించి భూములను తీసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. ఏటా సాగు చేస్తున్న భూముల గుత్తలను పెంచడం అన్యాయమని, నష్టాలు వచ్చినప్పుడు తమను ఎవరూ ఆదుకోవడం లేదంటూ కౌలు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏదేమైనా గత రెండు సీజన్లలో వచ్చిన పంట దిగుబడులు, కౌలు రైతులను ఓ వైపు ఆనందంలో ముంచినా కౌలు మునుగుత్తలు ఆందోళనకు గురి చేస్తున్నాయి.

కౌలు పెంచడం అన్యాయం



ఏటా పంటల సాగుతో కష్ట,నష్టాలను అనుభవిస్తున్నాం. గత ఖరీఫ్, రబీలో మాత్రం పంట దిగుబడులు బాగా రావడం, మద్దతు ధర లభించడంతో కొంత నష్టాల నుంచి బయట పడ్డాం. లాభాలు వచ్చాయని భూ యజమానులు గుత్తలు పెంచడం సరికాదు. గత నాలుగేళ్లుగా పంటల సాగుకు పెట్టుబడి రాక నష్టపోయాం. ఆ సమయంలో తమకు ఎవరూ అండగా నిలవలేదు. కౌలు పెంచడంపై భూ యజమానులు పునరాలోచన చేయాలి.

-ఎల్లయ్య, కౌలు రైతు, చాపిరేవుల

దిగుబడి పెరిగిందని కౌలు పెంచడం తగదు



పంట దిగుబడులు పెరిగిందని యజమానులు భూముల కౌలు పెంచడం తగదు. ఒక్కో ఏడు ఒక్కో రకమైన దిగుబడులు వస్తూ లాభనష్టాలు రావడం సహజం. దిగుబడులు వచ్చాయని కౌలు పెంచడం అన్యాయం. వ్యవసాయాధికారులు కౌలు రైతులకు సబ్సిడీపై విత్తనాలను అందించి ఆదుకోవాలి.

- కాశిం, కౌలు రైతు, కానాల

ఆన్‌లైన్ దరఖాస్తు గడువు పొడిగించాలి

నంద్యాల(అర్బన్): జర్నలిస్టుల అక్రిడిటేషన్ ఆన్‌లైన్ దరఖాస్తుల గడువును ఈనెల 15వ తేదీ వరకు పొడిగించాలని ఏపీ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ మెంబర్, ఉమ్మడి జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు కోరారు. గడువు పెంచి దరఖాస్తు చేసుకోవడానికి వెసులుబాటు కల్పించాలని కోరుతూ గురువారం ఇన్‌చార్జ్ డీడీ మల్లికార్జునకు వినతి పత్రం అందజేశారు.

15న పెట్రోల్ బంక్ ప్రారంభం

డోర్నిపాడు:మండలంలోని గుండుపాపల గ్రామంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పెట్రోల్ బంక్‌ను ఈనెల 15న ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి, ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ గంగుల ప్రభాకర్ రెడ్డి, జిల్లా కేంద్ర సహకార సంఘం అధ్యక్షురాలు సన్నల మహాలక్ష్మి సమక్షంలో చైర్మన్ బాలవెంకటరెడ్డి అధ్యక్షతన ప్రారంభిస్తారని పీఏసీఎస్ ముఖ్య కార్యనిర్వహణాధికారి సుబ్బారావు గురువారం తెలిపారు. ఇందుకు ముఖ్య అతిథులుగా ఎంపీపీ అమర్‌నాథ్‌రెడ్డి, జిల్లా సహకార అధికారి విజయకుమారి తదితరులు హాజరవుతుని చెప్పారు. హిందుస్తాన్ పెట్రోలియం కార్పొరేషన్ సౌజన్యంతో, కేడీసీసీ బ్యాంక్ ఆర్థిక సాయంతో నిర్మించినట్లు పేర్కొన్నారు.

వినతుల పరిష్కారంలో చొరవ చూపాలి

ఉయ్యాలవాడ : ప్రజా వినతుల పరిష్కారంలో వివిధ శాఖల అధికారులు చొరవ చూపాలని ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు సూచించారు. గురువారం మండలంలోని హరివరం గ్రామ సచివాలయాలన్ని సందర్శించారు. ప్రతి గ్రామ సచివాలయంలో మధ్యాహ్నం మూడు నుంచి సాయంత్రం 5 గంటల వరకు స్పందన కార్యక్రమం నిర్వహించాలని ఆదేశించారు. ప్రజల సమస్యలపై శాఖల వారీగా సిబ్బంది సమన్వయంతో పని చేసి పరిష్కరించాలని చెప్పారు. మీ పరిధిలో పరిష్కారం కాకపోతే మండల స్థాయి అధికారుల దృష్టికి తీసుకు రావాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రాజశేఖర్, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

రైతులను ఆదుకునేందుకే దిగుబడుల కొనుగోలు



ఆళ్లగడ్డలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి

ఆళ్లగడ్డ: దళారుల బారి నుంచి కాపాడటంతో పాటు రైతు పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి పేర్కొన్నారు. స్థానిక మార్కెట్ యార్డులో గురువారం మార్కెట్ యార్డు చైర్మన్ గంధం రాఘవరెడ్డి అధ్యక్షతన మద్దతు ధరతో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ రైతును రాజును చేయడమే ప్రభుత్వ ధ్యేయమన్నారు. రైతులు దళారులను ఆశించకుండా పంటలను మార్కెట్ యార్డుకు తరలించి గిట్టుబాటు ధర పొందాలన్నారు. ఈ -క్రాప్ నమోదు చేయించుకున్న రైతులు ధాన్యం విక్రయించేందుకు ఆర్బీకేల్లో పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. క్వింటా రూ.1962 ప్రకారం మొక్కజొన్న కొనుగోలు చేస్తారని, కొనుగోలు చేసిన 21 రోజుల్లోపు రైతుల ఖాతాల్లో నగదు జమ చేస్తారని చెప్పారు. ఏడీఏ రామ్మోహన్‌రెడ్డి, ఏఓలు, రైతులు ఉన్నారు.

క్రీడలతో ప్రపంచ స్థాయి కీర్తి ప్రతిష్టలు

ఆళ్లగడ్డ: ఏ రంగంలో రాని విధంగా ప్రపంచ స్థాయి కీర్తి ప్రతిష్టలు క్రీడలతోనే సాధ్యమవుతుందని ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి తెలిపారు. రాష్ట్ర నాల్గవ టెన్నిస్ క్రికెట్ పోటీలు చాగలమర్రిలోని జిల్లా పరిషత్ క్రీడా మైదానంలో గురువారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే జ్యోతి ప్రజ్వలన చేసి, జాతీయ జెండా ఆవిష్కరించి పోటీలను ప్రారంభించారు. వివిధ జిల్లాల నుంచి వచ్చిన క్రీడాకారులను పరిచయం చేసుకుని అభినందించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు బాబూలాల్, కుమార్‌రెడ్డి, ముళ్ల రఫీ, ఖాదర్‌బాషా ఉన్నారు.



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎమ్మెల్యే

నాసిరకం విత్తనాలు అమ్మితే చర్యలు



విత్తన దుకాణంలో రికార్డులు పరిశీలిస్తున్న ఏడీఏ కృష్ణమోహన్ రెడ్డి

ఆళ్లగడ్డ: నకిలీ, నాసిరకం విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు తప్పవని ఇంటర్నల్ స్క్వాడ్ అధికారి, కోవెలకుంట్ల ఏడీఏ కృష్ణమోహన్‌రెడ్డి హెచ్చరించారు. ఇంటర్నల్ స్క్వాడ్ ఆన్ సీడ్స్‌లో భాగంగా గురువారం పట్టణంలోని పలు విత్తన దుఖాణాల్లో తనిఖీలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రైతులకు అమ్మిన విత్తనాలకు సంబంధించి తప్పనిసరిగా రశీదు ఇవ్వాలని సూచించారు. అధీకృత కంపెనీలకు చెందిన విత్తనాలను నిర్ణయించిన ధరలకు మాత్రమే విక్రయించాలని చెప్పారు. ఏఓ కిశోర్‌కుమార్‌రెడ్డి ఉన్నారు.

పురాతన సత్రాన్ని కూల్చడం బాధాకరం

మహానంది: ఏడు దశాబ్దాల చరిత్ర కలిగిన మహానందిలోని భూదేవయ్య వీరశైవ అన్నసత్ర మండపాన్ని కూల్చడం బాధాకరమని వీరశైవ సంఘం ప్రతినిధులు శంకరయ్య, శ్రీనివాసులు, తదితరులు ఆవేదన వ్యక్తం చేశారు. మహానందిలోని వీరశైవ అన్నసత్రాన్ని కూల్చడంతో గురువారం వారు మహానందికి చేరుకొని పరిశీలించారు. వారు మాట్లాడుతూ.. 1952లో కర్ణాటక రాష్ట్రానికి చెందిన భూదేవయ్య అనే భక్తుడు వీరశైవుల కోసం మండపాన్ని నిర్మించారని చెప్పారు. ప్రతి ఏడాది శివరాత్రి, కార్తిక మాసం ఉత్సవాలకు అన్నదానం నిర్వహించేవారమన్నారు. ఈ విషయంపై ఈఓ చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ ఆలయ అభివృద్ధి పనుల్లో భాగంగా తొలగించామని, అది దేవస్థానానికి చెందిన స్థలమని చెప్పారు.



కూల్చేసిన భూదేవయ్య సత్రం

అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా

కర్నూలు(రాజ్‌విహార్): వినియోగదారులకు అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా అందించాలని దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ కర్నూలు ఆపరేషన్స్ ఎస్ఈ ఎం.ఉమాపతి సూచించారు. ఆయన గురువారం స్థానిక విద్యుత్ భవన్ నుంచి టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత రెండు మూడు రోజులుగా గాలి, వర్షాలు ఉంటున్నాయని, వీటి వల్ల సరఫరాలో అంతరాయం ఏర్పడే అవకాశం ఉందని చెప్పారు. ముఖ్యంగా గాలికి బ్రేక్ డౌన్స్, ట్రిప్పింగ్స్, ఫీడర్ డౌన్ వంటి సమస్యలు తెలుత్తుతాయని పేర్కొన్నారు. అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉంటూ విద్యుత్ వినియోగదారుల నుంచి ఫిర్యాదులు అందిన వెంటనే స్పందించి పరిష్కరించాలని సూచించారు. అలాగే విధుల్లో అప్రమత్తంగా వ్యవహరించాలనికోరారు.

జీలుగ విత్తనాలు మంజూరు

ఉయ్యాలవాడ : పచ్చిరొట్టి ఎరువుగా ఉపయోగపడే జీలుగ విత్తనాలు 50 శాతం సబ్సిడీతో ప్రభుత్వం అందజేస్తుందని మండల వ్యవసాయాధికారి రాజేంద్రకుమార్ గురువారం తెలిపారు. మండలానికి 50 క్వింటాళ్లు జీలుగ, 6 క్వింటాళ్ల పిల్ల పెసర మంజూరయ్యాయన్నారు. 5 ఎకరాల్లోపున్న సన్న, చిన్న కారు రైతులకు 10 కేజీల జీలుగ విత్తనాలు ధర రూ. 790 కాగా 50 శాతం రాయితీతో రూ.395కు అందజేస్తామన్నారు. విత్తనాలు కావాల్సిన రైతులు రైతు భరోసా కేంద్రాల్లో పట్టాదారు పాసు బుక్, ఆధార్ జిరాక్స్‌తో సంప్రదించాలని చెప్పారు.

తప్పెట కళాకారులను ఆదుకోవాలి

నంద్యాల(అర్బన్): తప్పెట కళను నమ్ముకొని జీవిస్తున్న కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని ఆది అరుంధతి తప్పెట కళాకారుల సంఘం నాయకులు బాలసుబ్బయ్య, గోపాల్ కోరారు. ఇటీవల బోయలకుంట్లకు చెందిన మధు అనారోగ్యంతో మృతి చెందిన విషయాన్ని తెలుసుకొని సంఘం నాయకులు గురువారం మృతుడి కుటుంబానికి రూ.5వేలు సాయంగా అందించారు. చౌడయ్య, జోసెఫ్, మణి పాల్గొన్నారు.

ఆధునిక, ఆధ్యాత్మిక విద్యే లక్ష్యం

ఆళ్లగడ్డ: ఆధునిక, ఆధ్యాత్మిక విద్యను అందించడమే లక్ష్యంగా దారుల్ హుదా ఇస్లామిక్ విశ్వవిద్యాలయం వ్యవహరిస్తోందని విశ్వవిద్యాలయ పోగ్రాం మేనేజర్ మక్బూల్ హుసేన్ తెలిపారు. స్థానిక జూమియా మసీదులో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో పుంగనూరు దారుల్ హుదా ఇస్లామిక్ విశ్వవిద్యాలయం ప్రవేశాలకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ ఐదో తరగతి పూర్తి చేసుకుని ఆరవ తరగతిలో ప్రవేశించే విద్యార్థులకు ఈ నెల 13వ తేదీన స్థానిక అల్బుర్హాన్ మస్జిద్‌లో ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని చెప్పారు. ఉచిత వసతి సౌకర్యాలతో విద్యను అందిస్తున్నందున అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రభుత ఖాజీ మహమ్మద్ జాఫర్, బీరువాల బాషా పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

నంద్యాల టౌన్: ఈ ఏడాది పది, ఇంటర్‌లో ప్రతిభ చూపిన పద్మశాలీయ విద్యార్థులకు పద్మశాలీయ సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో పురస్కారాలు అందజేస్తామని, అర్హులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని నిర్వాహకులు పబ్బు తులసీ కృష్ణ గురువారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ ప్రతిభ చూపిన వారికి వెండి మెమొంటోతో పాటు పుస్తకాలు అందజేస్తామని చెప్పారు. అలాగే 2023 నీట్‌లో ఎంబీబీఎస్ సీట్ సాధించిన పేద పద్మశాలి విద్యార్థులకు సంవత్సరానికి రూ.పది వేల చొప్పున అందజేస్తామని పేర్కొన్నారు. ఈ నెల 31వ తేదీలోపు మార్కుల జాబితా, కుల ధ్రువీకరణ పత్రం, ఆధార్ జిరాక్స్ కాపీలను తులసీ కృష్ణ సేవా ట్రస్ట్ కార్యాలయంలో అందజేయాలని కోరారు.

బీజేపీ ఎంపీపై చర్యలు తీసుకోవాలి

నంద్యాల(న్యూటౌన్): రెజ్లర్ క్రీడాకారిణిలపై లైంగిక వేధింపులకు పాల్పడిన బీజేపీ ఎంపీ బ్రిజ్ భూషణ్ శరణ్‌సింగ్ పార్లమెంట్ సభ్యత్వాన్ని రద్దు చేసి చర్యలు తీసుకోవాలని డీవైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి రామన్న డిమాండ్ చేశారు. స్థానిక కార్యాలయంలో గురువారం నిర్వహించిన ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఢిల్లీలో 18 రోజుల నుంచి తమకు న్యాయం చేయాలని క్రీడాకారిణులు నిరసన వ్యక్తం చేస్తున్నా చర్యలు చేపట్టకపోవడం దారుణమన్నారు. దేశ కీర్తిని ప్రపంచ వ్యాప్తంగా విస్తరింపజేసిన క్రీడాకారిణుల పట్ల ఎంపీ ప్రవర్తన తీరు దుర్మార్గమని, అలాంటి వారిని పదవుల్లో కొనసాగించి దేశ ప్రతిష్టను దిగజార్చవద్దని సూచించారు. డీవైఎఫ్ఐ పట్టణ కార్యదర్శి శివ, నాయకులు వినీత్, సంజయ్, మధు, నాగూర్ పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయం



వృద్ధుడి సమస్యను ఆలకిస్తున్న ఎమ్మెల్యే శిల్పా రవి

నంద్యాల: అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని 2, 5వ వార్డుల్లో కౌన్సిలర్లు అరీఫ్‌నాయక్, సాదిక్‌బాషా ఆధ్వర్యంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి మూడున్నరేళ్ల పాలనలో అందించిన సంక్షేమ పథకాల లబ్ధిని ప్రజలకు వివరించారు. ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలు మీకు సక్రమంగా అందుతున్నాయా? మీ వలంటీర్ సేవలు ఎలా ఉన్నాయి? అధికారుల పనితీరు ఎలా ఉంది? ఇంకా ఏమైనా సమస్యలు ఉన్నాయా అంటూ ప్రజలను అడుగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ సంక్షేమ పథకాలు కొనసాగాలన్నా, మరింత మెరుగైన పాలన అందాలంటే మరోసారి జగనన్నను సీఎంగా ఆశీర్వదించాలని కోరారు. పథకాలకు ప్రజల్లో ఆదరణ లభిస్తుండటంతో టీడీపీ నాయకులు ఓర్వలేక పసలేని ఆరోపణలు చేస్తున్నారని, మిమ్మల్ని తప్పుదోవ పట్టించడానికి మరోసారి ప్రయత్నించకుండా బుద్ధి చెప్పాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ మాబున్నిసా, వైస్ చైర్మన్ గంగిశెట్టి శ్రీధర్, కౌన్సిలర్లు సమ్మద్, కలాంబాషా, చంద్రశేఖర్, కో ఆప్షన్ సభ్యుడు సలాముల్లా, మాజీ కౌన్సిలర్లు లక్ష్మీనారాయణ, మునెయ్య, నాయకులు కిరణ్‌కుమార్, ఆసిఫ్, రహంతుల్లా, సోమశేఖర్‌రెడ్డి, దండె సుధాకర్ పాల్గొన్నారు.

రక్త హీనత నివారణకు చర్యలు తీసుకోండి



మాట్లాడుతున్న కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్

నంద్యాల: సుస్థిరాభివృద్ధి లక్ష్యాల్లో భాగంగా గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికల్లో రక్తహీనత ఉన్న వారిని గుర్తించి హిమోగ్లోబిన్ శాతం పెంచేందుకు పటిష్ట చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి డాక్టర్ కె.ఎస్. జవహర్ రెడ్డి జిల్లా కలెక్టర్లకు సూచించారు. గురువారం వివిధ శాఖల కార్యదర్శులతో కలిసి సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు, నాడు-నేడు, జగనన్న విద్యా కానుక కిట్లు, స్పందన అర్జీల పరిష్కారం, గ్రామ వార్డు సచివాలయాలు తదితర అంశాలపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్లతో సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ ఛాంబర్ నుంచి జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్, జాయింట్ కలెక్టర్ నిశాంతి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ నాడు-నేడు కింద జిల్లాలో ఇంకా ప్రారంభం కాని 7 అంగన్‌వాడీ భవనాల నిర్మాణాలను వెంటనే ప్రారంభించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రైవేటు పాఠశాలల్లో 25 శాతం ఉచిత అడ్మిషన్ల భర్తీ నిమిత్తం పాఠశాల విద్యాశాఖ అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. ప్రతి పాఠశాలలో మౌలిక వసతులు విద్యా సంవత్సరం ప్రారంభం కాకముందే పూర్తి కావాలని చెప్పారు. పాఠశాలలు తెరిచిన వెంటనే జగనన్న విద్యా కానుక కిట్లను విద్యార్థులకు పంపిణీ చేయాలని తెలిపారు.

రెడ్‌క్రాస్ సేవలు మరువలేనివి

నంద్యాల(వ్యవసాయం): నంద్యాల జిల్లాలో రెడ్‌క్రాస్ సేవలు మరువలేనివని ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి పేర్కొన్నారు. ఇటీవల గ్యాస్ సిలిండర్ పేలి పూర్తిగా ధ్వంసమైన గృహాల యజమానులకు గురువారం ఎమ్మెల్యే కార్యాలయంలో రెడ్‌క్రాస్ బృందం ఆధ్వర్యంలో వంట సామగ్రిని, నిత్యావసర సరుకులను అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సమస్య తెలిసిన వెంటనే స్పందించిన రెడ్‌క్రాస్ సొసైటీ కమిటీ సభ్యులను అభినందించారు. జిల్లా చైర్మన్ దస్తగిరి మాట్లాడుతూ ఎంపీ, ఎమ్మెల్యే సహకారంతో త్వరలో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడుతామన్నారు. మున్సిపల్ చైర్మన్ మాబున్నిసా, వైస్ చైర్మన్ గంగిశెట్టి శ్రీధర్, నాగేశ్వరరావు, నాగేశ్వరరెడ్డి, ఉస్మాన్ బాషా, యాకూబ్, రమేష్ పాల్గొన్నారు.



నిత్యావసర సరుకులు, సామగ్రి అందజేస్తున్న ఎమ్మెల్యే శిల్పా రవి

కారు బోల్తా.. ఇద్దరికి గాయాలు

ఆళ్లగడ్డ: చాగలమర్రి మండలం మద్దూరు మెట్ట సమీపంలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మహిళలు తీవ్రంగా గాయపడ్డారు. వైఎస్సార్ జిల్లా కడపకు చెందిన సుజాత, అనురాధ ఏపీ 040 0036 నంబరు గల కారులో కర్నూలులో వివాహానికి హాజరై తిరిగి కడపకు బయలదేరారు. ఈ క్రమంలో మద్దూరు మెట్ట సమీపంలో కారు అదుపు తప్పి జాతీయ రహదారి పక్కనున్న కల్వర్టులో బోల్తా పడింది. ప్రమాదంలో సుజాత, అనురాధ గాయపడగా డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను ఆళ్లగడ్డ వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ రమణయ్య తెలిపారు.